సూర్య
www.suryaa.com
18వ వసంతంలోకి ...

అదిలాబాద్ - మంచిర్యాల



సూర్య
www.suryaa.com

★ నిర్మల్ ★ కొమురంభీం ఆసిఫాబాద్

గురువారం 06 మార్చి 2025 , పేజీలు 04

## ఇళ్లు కట్టడంలో మేస్త్రీల ప్రాముఖ్యత చాలా ముఖ్యం

**- జిల్లా పాలనాధికారి రాజర్షి షా**

**ఆదిలాబాద్,సూర్య మేజర్ న్యూస్**

ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించిన నేషనల్ అకాడమీ కన్స్ట్రక్షన్ ద్వారా గత సోమవారం నుండి వారం రోజుల పాటు జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయంలో ప్రతీ మండలం నుండి ఇద్దరు మెస్త్రీలకు ఇస్తున్న శిక్షణలో భాగంగా బుధవారం జిల్లా పాలనాధికారి రాజర్షి షా సందర్శించి మాట్లాడుతూ ఇందిరమ్మ ఇల్లు నాణ్యత ప్రమాణాలు పాటించి కట్టడానికి సిద్ధంగా ఉండేందుకు శిక్షణ ఇవ్వడం జరుగుతుందని, ఇళ్లు కట్టడంలో మేస్త్రీల ప్రాముఖ్యత చాలా ముఖ్యం అన్నారు. గత సోమవారం నుండి మూడు రోజుల పాటు ఇస్తున్న శిక్షణలో మార్కెట్ , ఇటుకకు సంబంధించి,తదితర వాటిపై న్యాక్ ఆధ్వర్యంలో శిక్షణ ఇవ్వడం జరుగుతుందని అన్నారు.17 గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం నాణ్యత ప్రమాణాలు పాటించి ఎంపీడీవో పంచాయతీ కార్యదర్శులు, మేస్త్రీల సహకారం తో కంప్లీట్ చేయడానికి అందరూ సిద్ధంగా ఉండాలని అన్నారు.ఇందిరమ్మ ఇళ్ల పై సంబంధిత మండలాల అధికారులతో సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ17 మండలాల్లోని 17 గ్రామపంచాయితీలలో ఎంపికైన 2148 ఇండ్లకు మార్కింగ్ ను వేగవంతం పూర్తి చేయాలన్నారు. మిగిలిన అన్ని గ్రామాలలోని ఇండ్లకు సంబందించిన వెరిఫికేషన్ ప్రక్రియను మార్చ్ 7లోగా పూర్తిచేసి నివేదిక సమర్పించాలన్నారు. 15 మంది అమరవీరుల కుటుంబాల అభిప్రాయం సేకరించగా, వారి అభిప్రాయం మేరకు ముత్నూర్ గ్రామ పంచాయితీ పరిధిలో నివాస స్థలాలను కేటాయించడం జరిగిందని, అట్టి నివాస స్థలాల అభివృద్ధి పనులకు సంబందించిన ఎస్టిమేట్ ను సిద్దం చేయాలని పీడీ హౌసింగ్ ను ఆదేశించారు. అలాగే స్వంత గ్రామాల్లో ఇల్లు కట్టుకోవాలనుకునే వారి జాబితాను ఎంపీడీఓ లు సిద్ధం చేయాలనీ ఆదేశించారు.విద్యుత్, త్రాగునీటి సౌకర్యం సత్వరం కల్పించాలని సంబంధిత ఎఅధికారులను ఆదేశించారు.నీటి ఎద్దడి ఉన్న ఏడు క్రిటికల్ మండలాలు అయిన అదిలాబాద్ రూరల్, బజార్ హత్నూర్, ఇంద్రవెల్లి, గాదిగూడ, నార్నూర్, సిరికొండ, ఉట్నూర్ లలో ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో సీఈఓ జితేందర్, హౌసింగ్ పీడీ , ఎంపిడిఒ లు, పంచాయితి సెక్రటరీ లు, తదితరులు పాల్గొన్నారు.



## ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారంపై ప్రత్యేక చర్యలు






**- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**

**మంచిర్యాల ప్రతినిధి,సూర్య మేజర్ న్యూస్ :**

జిల్లాలో ప్రజావాణి కార్యక్రమంలో వచ్చే దరఖాస్తుల పరిష్కారంపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం జిల్లాలోని నస్పూర్ గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో డి.సి.పి. ఎ. భాస్కర్, జిల్లా అదనపు కలెక్టర్ సజావత్ మోతిలాల్ లతో కలిసి ఎ.సి.పి.లు, తహశిల్దార్లు, సి.ఐ.లు, ఎస్.ఐ.లు, అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల ప్రవర్తనా నియమావళి ముగిసిన తరువాత ఈ నెల 10వ తేదీ నుండి ప్రారంభమయ్యే ప్రజావాణి కార్యక్రమంలో వచ్చే దరఖాస్తుల పరిష్కారంపై రెవెన్యూ, పోలీసు శాఖల సమన్వయంతో ప్రత్యేక చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ క్రమంలో మండల స్థాయిలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమానికి తహశిల్దార్, ఎస్. హెచ్ ఓ, మండల పంచాయతీ అధికారి, మున్సిపల్ పరిధిలో తహశిల్దార్, ఎస్.హెచ్.ఓ., మున్సిపల్ కమీషనర్ హాజరై అర్జీదారుల నుండి దరఖాస్తులు స్వీకరించి కనీసం 15 రోజులు, గరిష్టంగా 21 రోజులలోగా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని తెలిపారు. మండల పరిధిలో పరిష్కారమయ్యే భూ సమస్యలను రికార్డులను సరి చూడాలని, దరఖాస్తులపై క్షేత్రస్థాయిలో సమగ్ర విచారణ జరిపి పరిష్కరించాలని తెలిపారు. డివిజన్ స్థాయిలో రాజస్వ మండల అధికారి, ఎ.సి.పి.లు, జిల్లా స్థాయిలో జిల్లా కలెక్టర్, డి.సి.పి.లు ప్రజావాణి కార్యక్రమంలో పాల్గొని ఆర్జీదారుల నుండి దరఖాస్తులు స్వీకరించి అప్పటికప్పుడు పరిష్కారమయ్యే వాటిని పూర్తి చేయడం జరుగుతుందని తెలిపారు. ప్రతి దరఖాస్తుకు సంబంధించి ఆయా స్థాయిలలో రిజిస్టర్ ఖచ్చితంగా నిర్వహించాలని, నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని, తమ పరిధిలో లేని సమస్యలపై వచ్చిన దరఖాస్తులను పైస్థాయికి సిఫారసు చేయాలని తెలిపారు. కోర్టులో పరిష్కారమయ్యే సమస్యలపై సంబంధిత అర్జీదారులకు అవగాహన కల్పించాలని, బెదిరింపులు, ఆందోళన చర్యలకు పాల్పడినట్లయితే సంబంధిత వ్యక్తులపై ఎఫ్.ఐ.ఆర్. నమోదు చేయాలని తెలిపారు. దరఖాస్తుల పరిష్కారం కొరకు అవసరమైన సమాచారాన్ని ఆయా స్థాయిల పరిధిలోని వివిధ శాఖల నుండి పొందవచ్చుని తెలిపారు. ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురి కాకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని, అక్రమిత ప్రభుత్వ భూములను చేపట్టిన నిర్మాణాలను తొలగించి స్వాధీనపర్చుకోవాలని తెలిపారు. భూములకు సంబందించి తప్పుడు/ నకిలీ ధృవపత్రాలకు సంబంధించి జిల్లా స్థాయి అధికారులకు రిపోర్టు చేయాలని తెలిపారు. ప్రజావాణి కార్యక్రమంలో అందిన ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి త్వరితగతిన పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని, దరఖాస్తుల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో మంచిర్యాల, జైపూర్, బెల్లంపల్లి ఎ.సి.పి.లు ప్రకాష్, వెంకటేశ్వర్లు, రవికుమార్, మండలాల తహశిల్దార్లు, సి.ఐ.లు, ఎస్.ఐ.లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## ఇంటర్ పరీక్షా కేంద్రం ఆకస్మిక తనిఖీ

**- పరీక్షల నిర్వహణ తీరును నిశితంగా పరిశీలించిన జిల్లా కలెక్టర్ అభిలాషా అభినవ్**

**నిర్మల్, సూర్య మేజర్ న్యూస్**

జిల్లా కేంద్రంలోని శాంతి నగర్ ప్రభుత్వ బాల, బాలికల జూనియర్ కళాశాలలలో కొనసాగుతున్న ఇంటర్మీడియట్ పరీక్షా కేంద్రాలను జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ పరీక్షల తొలిరోజు అయిన బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరీక్షల నిర్వహణ తీరును నిశితంగా పరిశీలించారు. విద్యార్థుల హాజరు గురించి ఆరా తీశారు. సీ.సీ కెమెరా నిఘా నడుమ నిబంధనలకు అనుగుణంగానే పరీక్ష నిర్వహిస్తున్నారా? నిర్ణీత సమయంలో ప్రశ్న పత్రాలను తెరిచారా? లేదా? అని పరిశీలించారు. పరీక్షా కేంద్రాల్లో తాగునీటి వసతి, ఏ.ఎన్,ఎం, టాయిలెట్స్ అందుబాటులో ఉన్నాయా అని గమనించారు. ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా సజావుగా పరీక్షలు జరిపించాలని సూచించారు. పరీక్ష పూర్తయిన వెంటనే ఆన్సర్ షీట్లు తగిన పోలీసు బందోబస్తు మధ్య నిర్దేశిత కేంద్రాలకు తరలించాలని, ఎలాంటి కాపీయింగ్ కు అవకాశం లేకుండా పూర్తి పారదర్శకంగా, పక్కాగా పరీక్షలు జరిపించాలని ఆదేశించారు. ఎలక్ట్రానిక్ వాచీలు వంటి ఉపకరణాలు ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించకూడదని సూచించారు. కలెక్టర్ వెంట జిల్లా ఇంటర్మీడియట్ అధికారి పరశురాం, తదితరులు ఉన్నారు.








## జిల్లా అభివృద్ధికి సమన్వయంతో కృషి

**.... జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే**



**ఆసిఫాబాదు ప్రతినిధి,సూర్య మేజర్ న్యూస్ :**

జిల్లా అభివృద్ధి అన్ని శాఖల అధికారుల సమన్వయంతో కృషి చేయడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. జిల్లా కలెక్టర్ గా పదవి బాధ్యతలు స్వీకరించి ఏడాది పూర్తి అయిన సందర్భంగా కలెక్టర్ ఛాంబర్ లో పాత్రికేయులతో మాట్లాడారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను అర్హులైన వారికి అందించేందుకు ప్రత్యేకంగా శ్రద్ధ చూపడం జరుగుతుందన్నారు. వసతి గృహాల్లో రాత్రి బస చేయడం వల్ల విద్యార్థుల మంచి చెడులు తెలుసుకోవడం సంతృప్తిని ఇచ్చిందన్నారు. జిల్లాలో నీటి సమస్య తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో జనవరి మాసం నుండి ముందుకు వెళ్లడం జరుగుతుందని తెలిపారు. వేసవిలో విద్యుత్ సమస్య లేకుండా ముందస్తు కార్యాచరణలో భాగంగా ట్రాన్స్ఫార్మర్లు మార్చడంతో పాటు విద్యుత్తు లైన్లను సరి చేయడం జరుగుతుందని తెలిపారు. ఏడాది కాలం పాటు జిల్లాలో పనిచేయడం వల్ల ఈ ప్రాంతంలో ఎంతో నేర్చుకోవడం జరిగిందని రానున్న రోజుల్లో మరింత ఉత్సాహంతో అన్ని శాఖల అధికారుల సమన్వయంతో ప్రజల సంక్షేమం అభివృద్ధి కోసం కృషి చేస్తామని తెలిపారు. అర్హులైన వారికి ప్రభుత్వ అభివృద్ధి సంక్షేమ ఫలాలు క్షేత్రస్థాయిలో అందించేందుకు సంబంధిత శాఖల ద్వారా లక్ష్యాలను చేరవేసేందుకు తగు చర్యలు చేపడుతున్నామని తెలిపారు

# ఇంటర్ వార్షిక పరీక్షలను పకడ్బంధీగా నిర్వహించాలి

## - జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**మంచిర్యాల,సూర్య మేజర్ న్యూస్ :**

జిల్లాలో ఈ నెల 25వ తేదీ వరకు జరుగనున్న ఇంటర్మీడియట్ పరీక్షలను ఎలాంటి అవకతవకలకు తావు లేకుండా పకడ్బంధీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఆల్ఫోర్స్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఇంటర్ పరీక్షా కేంద్రాన్ని సందర్శించి పరీక్ష తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణ కొరకు 23 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని, మొదటి రోజు జనరల్ పరీక్షకు 5 వేల 697 మంది విద్యార్థులు హాజరు కావలసి ఉండగా 5 వేల 472 మంది, ఒకేషనల్ పరీక్షకు 668 మంది హాజరు కావలసి ఉండగా 606 మంది విద్యార్థులు హాజరయ్యారని తెలిపారు. పరీక్ష కేంద్రాలలో విద్యార్థులకు సరిపడా ఫర్నిచర్, త్రాగునీరు, ఫ్యాన్లు, వెలుతురు ఉండేలా ఏర్పాట్లు చేయడం జరిగిందని, విద్యార్థుల పరీక్ష కేంద్రంలోనికి వెళ్ళే సమయంలో తనిఖీలు నిర్వహించాలని తెలిపారు. పరీక్షా కేంద్రంలోని మొబైల్, ఇతర ఎలాంటి ఎలక్ట్రానిక్ పరికరాలను అనుమతించడం జరగదని, ప్రతి పరీక్ష కేంద్రంలో అత్యవసర వైద్య సేవలు నిమిత్తం వైద్య సిబ్బందిని నియమించి అవసరమైన మందులు, ఓ. ఆర్.ఎస్. ప్యాకెట్లు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవడం జరిగిందని తెలిపారు. విద్యార్థులు సకాలంలో పరీక్షా కేంద్రాలకు చేరుకునే విధంగా ఆయా రూట్లలో సమయానుసారంగా బస్సులు నడిపించడం జరుగుతుందని, పరీక్ష ప్రశ్నా పత్రాలు, జవాబు పత్రాలను బందోబస్తు మధ్య తరలించడం జరుగుతుందని తెలిపారు. పరీక్షా కేంద్రాల సమీపంలో 144 సెక్షన్ అమలు చేయడంతో పాటు జిరాక్స్ సెంటర్లు మూసి ఉంచుతూ పరీక్ష సమయంలో అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా జరిగే విధంగా చర్యలు చేపట్టామని తెలిపారు. జిల్లాలో ప్రశాంత వాతావరణంలో పరీక్షలు సజావుగా నిర్వహించేందుకు పూర్తి స్థాయిలో ఏర్పాట్లు చేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు



# బేటి బచావో బేటి పడావో దశాబ్ది ఉత్సవాలు

## - డిగ్రీ విద్యార్థినులతో ఇంటరాక్ట్ అయిన స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్

**నిర్మల్ మార్చి 5, సూర్య మేజర్ న్యూస్.**

బేటి బచావో బేటి పడావో దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా డిగ్రీ విద్యార్థినులతో ఇంటరాక్ట్ అయిన స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్.బేటి బచావో బేటి పడావో కార్యక్రమం పది సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ కార్యక్రమం ఆవశ్యకత తెలియజేసేందుకై జిల్లాలోని పలువురు డిగ్రీ విద్యార్థినులతో బుధవారం








సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా అదనపు కలెక్టర్ విద్యార్థినుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. బాలికలు ఉన్నత విద్యను చదివి జీవితంలో ఉన్నత స్థానంలో నిలవాలని తెలిపారు. బేటి బచావో బేటి పడావో కార్యక్రమం ప్రారంభమై 10 సంవత్సరాలు పూర్తి చేసుకున్నందున జనవరి 22వ తేదీ నుంచి మార్చి 8వ తేదీ వరకు 45 రోజుల కార్యక్రమాన్ని నిర్వహించుకుంటున్నట్లు తెలిపారు. విద్యార్థి దశ నుంచే బాలికలకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్, బాల్య వివాహాల వల్ల కలిగే అనర్ధాలు, లింగ నిర్ధారణ, భ్రూణ హత్యలు, తదితర అంశాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. వివిధ హెల్ప్ లైన్ నంబర్లు 100,1098,181,1930లు, బాల్య వివాహ నిర్మూలన చట్టం-2006, బాలికలు,మహిళల హక్కులు,చట్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. గ్రామ స్థాయి నుండి జిల్లా స్థాయి వరకు పరిపాలన విధానం, భవిష్యత్తు ప్రణాళిక, మహిళా సాధికారత ,బేటి బచావో బేటి పడావో యొక్క ప్రాముఖ్యత, తదితర అంశాలపై చర్చించారు.ఈ కార్యక్రమంలో ఎసిడిపిఓ నాగలక్ష్మి, మిషన్ శక్తి సమన్వయకర్త సవిత, మిషన్ శక్తి బృంద సభ్యులు,విద్యార్థినులు,అధ్యాపకులు,ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# మొదటి రోజు ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రశాంతం

**బెల్లంపల్లి, మార్చి 05, సూర్య మేజర్ న్యూస్:**

బెల్లంపల్లి పట్టణంలో ఇంటర్మీడియట్ పరీక్షలు బుధవారం రోజున ప్రశాంతంగా జరిగాయి. పట్టణంలో మూడు పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. మొత్తం మూడు పరీక్ష కేంద్రాల్లో 1128 మంది విద్యార్థులకు



41 మంది గైర్హాజరుకాగా 1087 మంది విద్యార్థులు హాజరయ్యారు. పరీక్ష కేంద్రాల వద్ద బెల్లంపల్లి వన్ టౌన్ ఇన్స్పెక్టర్ ఎన్ దేవయ్య ఆధ్వర్యంలో పోలీసులు ప్రతిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. ఉదయం 9 గంటలకు పరీక్షలు ప్రారంభం కాగా గంటముందే విద్యార్థులు వారి సంఖ్యలో పరీక్షా కేంద్రాలకు చేరుకున్నారు.కొందరు విద్యార్థులు సమయానికి అక్కడ చేరుకోగా వారు పరీక్ష కేంద్రాలకు పరుగులు తీశారు. బాలుర జూనియర్ కళాశాల పరీక్ష కేంద్రంలో 429 మంది విద్యార్థులకు గాను 14 మంది 415 మంది హాజరయ్యారు, బాలికల రెసిడెన్షియల్ జూనియర్ కళాశాల పరీక్ష కేంద్రంలో 414 మంది విద్యార్థులకు గాను 16 మంది హాజరు కాగా 398 మంది హాజరయ్యారు, బాలికల జూనియర్ కళాశాల పరీక్ష కేంద్రంలో 285 మంది విద్యార్థులకుగాను 11మంది విద్యార్థులు గైర్హాజయ్యారు. 274మంది హాజరయ్యారు.

# జన్నారంలో ప్రారంభమైన ఇంటర్ పరీక్షలు

**జన్నారం, మార్చి 05, సూర్య మేజర్ న్యూస్ :**

జన్నారం మండల కేంద్రంలో బుధవారం ఇంటర్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. జన్నారంలో రెండు పరీక్ష కేంద్రాలుండగా రాఘవేంద్ర కరిమల జూనియర్ కళాశాలతో పాటు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 274 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 255 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. 19 మంది విద్యార్థులు హాజరు కాలేదని అధికారులు తెలిపారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 145 మంది విద్యార్థులకు 134 మంది విద్యార్థులు హాజరు కాగా 11మంది గైర్హాజరయ్యారు. అదేవిధంగా రాఘవేంద్ర కరిమల జూనియర్ కళాశాల సెంటర్లో 129 మంది విద్యార్థులు ఉండగా 121 మంది విద్యార్థులు హాజరయ్యారు.8 మంది విద్యార్థులు హాజరు కాలేదని ఆయా కళాశాలలో ప్రిన్సిపాల్‌లు శ్రీనివాస్, లక్ష్మణ్‌లు తెలిపారు. పరీక్ష కేంద్రాలను స్థానిక తహసిల్దార్ రాజ మనోహర్ రెడ్డి సందర్శించి వసతుల గురించి ఆరా తీశారు. మొదటి రోజు పరీక్ష ప్రశాంతంగా జరగడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.

# కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి

## - ఏఐటీయూసీ నాయకులు

**మందమర్రి, మార్చ్ 5, సూర్య మేజర్ న్యూస్.**

మందమర్రి ఏరియాలో విధులు నిర్వహిస్తున్న సింగరేణి సివిల్ కార్మికులు, కంట్రాక్ట్ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామని, కార్మికులకు ఎల్లప్పుడూ అండగా ఉంటామని కార్మిక గుర్తింపు సంఘం ఏఐటియుసి బ్రాంచ్ కార్యదర్శి సలేంద్ర సత్యనారాయణ, ఏరియా ఉపాధ్యక్షులు భీమనాధుని సుదర్శన్ లు అన్నారు. బుధవారం ఏరియాలోని సివిల్ డిపార్ట్మెంట్లో నిర్వహించిన ద్వార సమావేశంలో కార్మికులను ఉద్దేశించి వారు మాట్లాడుతూ కార్మిక సంక్షేమం కోసం యాజమాన్యంతో మాట్లాడి సమస్యలు పరిష్కార దిశగా ముందుకు సాగుతున్నామని, ఏరియాలోని కార్మిక కాలనీలలో అంతర్గత రోడ్ల సమస్య పరిష్కరించామని, కాలనీలలో క్వాటర్ల మధ్యలో ఉన్న డ్రైనేజీ వ్యవస్థను తక్షణమే పరిష్కరిస్తామని యాజమాన్యం హామీ ఇచ్చిందని వారు తెలిపారు. సివిల్ డిపార్ట్మెంట్ కార్మికుల ప్రమోషన్ లను మార్చి నెల తర్వాత ఇస్తామని యాజమాన్యం హామీ ఇవ్వడం జరిగిందని అన్నారు. అదేవిధంగా కాంట్రాక్ట్ కార్మికులకు హై పవర్ వేతనాలు అమలు అంశాన్ని, కాంట్రాక్ట్ కార్మికుడు ఒకరోజు విధులకు రాకుంటే వేతనం కట్ చేసే పద్ధతిని మానుకోవాలని సీ అండ్ ఎండి బలరాం దృష్టికి తీసుకెళ్లగా సానుకూలంగా స్పందించిన ఆయన పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు. సింగరేణి ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో ప్రధాన డిమాండ్స్ స్వంత ఇల్లు సాకారం, పెర్క్స్ పై ఇన్కమ్ టాక్స్ మాఫీ, తదితర అంశాలు ఈనెలలో సిఎండి ఆధ్వర్యంలో జరుగనున్న స్ట్రక్చర్ సమావేశంలో ప్రధాన సమస్యలపై ఒక అవగాహనకు రానుందని, ఏఐటీయూసీ అధ్యక్ష కార్యదర్శులు వాసిరెడ్డి సీతారామయ్య కొరిమి రాజ్ కుమార్లు కమిటీ మెంబర్లు స్ట్రక్చర్ సమావేశంలో పాల్గొన నున్నారని తెలిపారు. ఈ సందర్భంగా ఏఐటియూసి యూనియన్ కు ఆకర్షితులై పలువురు కార్మికులు స్వచ్ఛందంగా యూనియన్‌లో చేరిన వారిలో బండి సదానందం, ఎండి సమీయొద్దీన్, జీ పున్నం,జి శ్రీనివాస్, బి రాజయ్య, ఎం నరేష్,బి వెంకటేష్,బిశ్రీకాంత్, బి రవీందర్,బి గణపతి సాంబశివుడు,శంకర్‌లకు కండువాలు కప్పి యూనియన్‌లో సాదరంగా ఆహ్వానించి, వీరికి యూనియన్‌లో సముచిత స్థానం కల్పిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో బ్రాంచ్ జాయింట్ సెక్రెటరీ కంది శ్రీనివాస్, బ్రాంచ్ సహకార్యదర్శి సోమిశెట్టి రాజేశం, ట్రేడ్స్ మెన్ నాయకుడు టేకుమట్ల తిరుపతి, ఏరియా నాయకుడు ఆంటోని దినేష్, వర్క్ మెన్ ఇన్స్పెక్టర్ ముల్కలపల్లి వెంకటేశ్వర్లు, పిట్ కార్యదర్శులు కలువల శ్రీనివాస్, మర్రి కుమార్, సిహెచ్పి శర్మ, ఓదేలు, పారిపెల్లి సంజీవ్, సివిల్ డిపార్ట్మెంట్ నాయకులు వెంకటేశ్వర్లు, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.



# సైబర్ జాగృతి దివాస్ పై మహిళలకుఅవగాహన

## ,,,డిఎస్పి హసీబుల్లా




**ఆదిలాబాద్ ,సూర్య మేజర్ న్యూస్**

మహిళా సైబర్ జాగృతి దినోత్సవ సందర్భంగా ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ గౌష్ ఆలం ఆదేశాల మేరకు డిఎస్పి హసీబుల్లా ఆధ్వర్యంలో బుధవారం ఆదిలాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సైబర్ జాగృతి దివాస్ నిర్వహించారు, సైబర్ బానిసత్వం, డిజిటల్ అరెస్ట్, ఉద్యోగ మోసాలు మరియు వేధింపులు అనే అంశాలపై మహిళలు మరియు బాలిక విద్యార్థులపై దృష్టి సారించి, ఆదిలాబాద్‌లో జరుగుతున్న వివిధ సైబర్ నేరాల గురించి వివరంగా వివరించారు. ఈ కార్యక్రమంలో సైబర్ క్రైమ్ డిఎస్పి హసీబుల్లా, ఆదిలాబాద్ సిఐ సునీల్ మరియు డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీమతి అతీకా బేగం మరియు ఐటి కోర్ రియాజ్, షీ టీం ఏ ఎస్సై సునీత, తదితరులు పాల్గొన్నారు.

# ఇంటి పన్ను వసూలు వంద శాతం పూర్తి చేయాలి

## - స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్

**నిర్మల్ మార్చి 5, సూర్య మేజర్ న్యూస్**








ఇంటి పన్ను వసూలు వంద శాతం పూర్తి చేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ మున్సిపల్ అధికారులను ఆదేశించారు.బుధవారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో గృహ, వాణిజ్య పన్ను వసూలు, శానిటేషన్ తదితర అంశాలపై మున్సిపల్ అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, పట్టణ ప్రాంతాలలో వాణిజ్య, గృహ పన్నుల వసూలును వంద శాతం పూర్తి చేయాలని ఆదేశించారు. సకాలంలో పన్నులు చెల్లించని వారికి చట్ట ప్రకారం రెడ్ నోటీసులు జారీ చేయాలనీ సూచించారు. ఇప్పటివరకు వసూలు చేసిన పన్నులు, బకాయిలకు సంబంధించి మున్సిపాలిటీల వారీగా వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా త్వరితగతిన పన్ను వసూలు పూర్తి చేయాలన్నారు. పన్నుల వసూలులో నిర్లక్ష్యం వహిస్తే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వ్యాపారస్తులు తప్పనిసరిగా వాణిజ్య లైసెన్సులను పునరుద్ధరించుకునేలా చర్యలు చేపట్టాలని, ప్రభుత్వ భవన సముదయాలలో వ్యాపారం నిర్వహించుకుంటున్న వ్యాపారస్తుల నుంచి అద్దెలు వసూలు చేయాలన్నారు. బకాయిలు పేరుకుపోయిన దుకాణాలను సీజ్ చేయాలని ఆదేశించారు. శానిటేషన్ కార్యక్రమాలు నిరంతరం కొనసాగించాలని సూచించారు.ఈ సమావేశంలో నిర్మల్, భైంసా, ఖానాపూర్ మున్సిపల్ కమిషనర్లు జగదీశ్వర్ గౌడ్, రాజేష్ కుమార్, జాదవ్ కృష్ణ లు మెప్మా పీడీ సుభాష్, శానిటరీ ఇన్స్ పెక్టర్లు, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

### ఐయూఎంఎల్ స్టేట్ జాయింట్ సెక్రటరీగా

## అలీం హుసైని నియామకం



**కాగ జ్ నగర్ సూర్య మేజర్ న్యూస్**

ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ (ఐయూఎంఎల్) పార్టీ స్టేట్ జాయింట్ సెక్రటరీగా కాగజ్నగర్ పట్టణానికి చెందిన మౌలానా అలీం హుసైని నియమితుల య్యారు. ఈ సందర్భంగా ఆయనకు ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు ప్రొఫెసర్ అబ్దుల్ మోహియోద్దీన్ ఖాదర్ శాలువాతో సన్మానించారు. తెలంగాణ రాష్ట్రంలో పార్టీనీ బలోపేతం చేయాలని ప్రజా సమస్యల పైన పోరాడాలని జాతీయ అధ్యక్షుడు సూచించారు. తనపై ఉచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా, పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని మౌలానా అలీం హుసైని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పలువురు అలీం హుసైనికి అభినందించారు.

### చీకటిని చీల్చేది విద్యే

**వాంకిడి, మార్చి 5 సూర్య మేజర్ న్యూస్**

వాంకిడి మండలంలోని లక్మినగర్‌లో మంగళవారం నిర్వహించిన శ్రామినేర్ శిబిర్ శిక్షణ కార్యక్రమంలో విద్య ప్రాధాన్యతపై బౌద్ధ గురువులు విలువైన సూచనలు చేశారు.భారతీయ బౌద్ధ మహాసభ జిల్లా అధ్యక్షులు అశోక్ మహుల్కర్ మాట్లాడుతూ, “మనిషి చీకటి జీవితాన్ని చీల్చే సాధనం విద్య మాత్రమే” అని పేర్కొన్నారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విద్య ద్వారానే సామాజిక మార్పును సాధించారని, అందుకే ప్రతి ఒక్కరూ తమ పిల్లలను మంచి విద్యాబుద్ధులు నేర్చేలా చూడాలని సూచించారు.మహారాష్ట్ర నాగపూర్ కు చెందిన బౌద్ధ గురువు భధాంతే భంతే దమ్మ సారధి మాట్లాడుతూ, “బుద్ధి మార్గం శాంతి ద్వారా నడుస్తూ, అంబేద్కర్ ఆలోచనలతో ముందుకు సాగితే ప్రతి మనిషి జీవితంలో మార్పు వస్తుంది” అని వివరించారు.అనంతరం బౌద్ధ గురువులు రాహుల్ బోధి, భంతే నిబ్బాణ్, మండల బౌద్ధ మహాసభ అధ్యక్షులు జయరాం, అంబేద్కర్ యువజన సంఘం ప్రధాన కార్యదర్శి దుర్గం సునీల్ కుమార్ మాట్లాడుతూ, “విద్య ద్వారా వ్యక్తిత్వ వికాసం సాధ్యమవుతుందని, బౌద్ధ ధర్మం శాంతి, సమానత్వం, విద్యను ప్రోత్సహిస్తుందని” తెలిపారు.కార్యక్రమంలో బౌద్ధ సమాజ్ అధ్యక్షులు విలాస్, రాజేంద్ర ప్రసాద్, ఉపాధ్యక్షులు దుర్గం హంస రాజ్, నాయకులు రోషన్ ఉప్రే, జైపాల్, ముకుంద్ రావు, శివాజీ, కుమార్, రాజేశ్వర్, మహిళా మండలి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.




## టీజీడబ్ల్యూసి చొరవతో గల్ఫ్ నుండి మృతదేహం స్వదేశానికి రాక

**లక్సెట్టిపేట, మార్చి05, సూర్య మేజర్ న్యూస్:**

మండలంలోని హనుమంతుపల్లె గ్రామవాసి విధి నిర్వహణలో భాగంగా ఓమన్ దేశంలో పనిచేస్తుండగా ప్రమాదవశాత్తు భవనం పై నుండి కింద పడి మృతి చెందిన గుమ్ముల కొమరయ్య (48) మృతదేహన్ని తెలంగాణ గల్ఫ్ కార్మికుల సంక్షేమ సమితి ఆధ్వర్యంలో స్వదేశానికి తీసుకువస్తున్నారు. ఈ సందర్భంగా తెలంగాణ గల్ఫ్ కార్మికుల సంక్షేమ సమితి జన్నారం మండల అధ్యక్షులు మగ్గిడి తిరుపతి స్పందించి డెడ్ బాడీని తొందరగా స్వదేశానికి పంపించేలాగా కృషి చేయాలని మాజీ మండల అధ్యక్షులు పాలాజీ శ్రీనివాస్ (ఒమన్)గారికి తెలియపరచగా ఆయన వెంటనే ఇండియన్ కౌన్సిలేట్, ఒమన్ పోలీస్, కంపెనీ యాజమాన్యంతో సమన్వయం చేసి మృతుని కుటుంబానికి రావాల్సిన నిధులు, డెడ్ బాడీ రాకముందే అందేలా ప్రత్యేక చొరవ చూపారని నాయకులు తెలిపారు. కేవలం ఆరు రోజుల్లోనే డెడ్ బాడీ స్వదేశానికి పంపే ప్రక్రియ పూర్తిచేసినా శ్రీనివాస్ కు మండల అధ్యక్షులు మగ్గిడి తిరుపతి, వ్యవస్థాపక అధ్యక్షులు కల్లెడ భూమయ్యలకు మృతుని కుటుంబ సభ్యులు ధన్యవాదాలు తెలియజేశారు.హైదరాబాదు విమానాశ్రయం నుండి మృతుని ఇంటి వరకు ప్రభుత్వ ఉచిత అంబులెన్స్ సౌకర్యాన్ని మంద భీమ్ రెడ్డి ఏర్పాటు చేశారన్నారు. మృతదేహం స్వదేశానికి తరలించడంలో సహకరించిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా మృతుని కుటుంబ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు. అనంతరం మగ్గిడి తిరుపతి మాట్లాడుతూ గల్ఫ్‌లో చనిపోయిన కార్మికులను స్వదేశానికి తెప్పియడానికి మా సంస్థ ఎల్లప్పుడూ ముందుంటుందన్నారు. మా వంతుగా మేము సహాయం చేస్తున్నామని ప్రభుత్వం నుండి మాకు కొంతవరకు సహాయం అందిన ఇంకా అందవలసినది చాలా ఉందన్నారు. గల్ఫ్ మృతుల కుటుంబాలకు ఎక్స్గ్రేషియా కొంతమందికి మాత్రమే అందిందని మిగతా వారికి కూడా తొందరగా అందజేయాలని ప్రభుత్వాన్ని ఆయన కోరారు. గల్ఫ్ బోర్డు ప్రకటన ఆలస్యం చేస్తే మళ్లీ ఉద్యమించక తప్పదన్నారు. ఈ ప్రక్రియను ఇంత వేగవంతంగా పూర్తి చేసిన టీ జీ డబ్ల్యూ డబ్ల్యూ సీ సంస్థ గౌరవ వ్యవస్థాపకులను కమిటీ సభ్యులను దీనికి సహకరించిన ప్రతి ఒక్కరిని గ్రామస్తులు అభినందించారు.తెలంగాణ గల్ఫ్ కార్మికుల సంక్షేమ సమితి తరఫున గుమ్ముల కొమరయ్యకు నివాళులు అర్పిస్తూ, ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.







## ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు అవగాహన సదస్సు

**భీమిని, సూర్య మేజర్ న్యూస్**

మండల కేంద్రం లోని మల్లిడి గ్రామపంచాయతీలో బుధవారం ఇందిరమ్మ ఇండ్ల పథకం లబ్ధిదారులందరికీ ఇంటి నిర్మాణం



సంబంధించిన అవగాహన కల్పించడం జరిగింది.ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా వి.బన్సీలాల్ జిల్లా గృహనిర్మాణ శాఖ(పిడి.హౌసింగ్) అధికారి హాజరయ్యారు.అదేవిధంగా బి. గంగా మోహన్, ఎంపీడీవో భీమిని, ఏఈ హౌసింగ్ లాయక్ అలీ,పంచాయతీ కార్యదర్శి పున్నం నాయక్,గ్రామ పెద్దలు,లబ్ధిదారులు పాల్గొన్నారు.జిల్లా గృహనిర్మాణ శాఖ అధికారి మాట్లాడుతూ లబ్దిదారులందరూ కూడా ఇంటి నిర్మాణానికి సంబంధించిన స్థలం శుభ్రంగా చేసుకొని సిద్ధంగా ఉండాలని ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే అందరూ ఇంటి నిర్మాణాలు ప్రారంభించాలని చెప్పడం జరిగింది.అదేవిధంగా ఇంటి నిర్మాణానికి లబ్ధిదారులే ప్రభుత్వ నిబంధనల ప్రకారం మార్కింగ్ ఇచ్చుకొని ప్రారంభించుకోవాలని చెప్పడం జరిగింది. ఇంటి నిర్మాణానికి మార్కింగ్ ఇచ్చే ముందు, పంచాయతీ కార్యదర్శికి సమాచారం ఇచ్చి వారి ఆప్ ద్వారా ఫోటో అప్లోడ్ చేయించుకోవాలని చెప్పడం జరిగింది.తదుపరి ఇంటి నిర్మాణం జరుగుతున్న క్రమంలో దశలవారీగా బేస్మెంట్ లెవెల్ పూర్తయ్యాక లక్ష రూపాయలు, స్లాబ్ లెవెల్ మరో లక్ష రూపాయలు, స్లాబ్ పూర్తయిన తర్వాత రెండు లక్షలు,ఇంటి నిర్మాణం పూర్తిస్థాయిలో అన్ని విధాలుగా పూర్తయిన తర్వాత మరో లక్ష రూపాయలు మొత్తం ఐదు లక్షలు రూపాయలు దశలవారీగా పంచాయతీ కార్యదర్శి ఆప్ ద్వారా ఫోటో అప్లోడ్ చేయించిన వెంటనే లబ్ధిదారుడి అకౌంట్‌కి జమ అవుతాయని, అదేవిధంగా లబ్ధిదారులు దళారులను నమ్మవద్దని చెప్పడం జరిగింది.ఇంటి నిర్మాణం 400 చదరపు అడుగులకు తగ్గకుండా,500 చదరపు అడుగులకు పెరగకుండా ప్రభుత్వం ఇచ్చిన ప్లాను ప్రకారం కచ్చితంగా నిర్మించాలని చెప్పడం జరిగింది.

### బదిలీపై వెళ్తున్న అధికారినికి ఘన సత్కారం

**మందమర్రి, మార్చి 5, సూర్య మేజర్ న్యూస్.**

మందమర్రి ఏరియా ఎస్టేట్ అధికారినిగా విధులు నిర్వహించి మణుగూరుకు బదిలీపై వెలుతున్న స్వప్నను సింగరేణి ఏరియా అధికారులు ఘనంగా సన్మానించారు. బుధవారం జనరల్ మేనేజర్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్ లో ఇంచార్జ్ జీఎం అబ్దుల్ ఖాదీర్ అధ్యక్షతన నిర్వహించిన సన్మాన కార్యక్రమంలో స్వప్నను ఘనంగా సన్మానించి జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా ఏరియా ఇంచార్జ్ జీఎం అబ్దుల్ ఖాదీర్ మాట్లాడుతూ ప్రతి ఒక్క అధికారికి ఉన్నత పదవులు రావడం, విధులు నిర్వహించిన చోటు నుండి వేరొక ఏరియాకు బదిలీపై వెళ్లడం అనివార్యమని అన్నారు. ఈ సందర్భంగా ఎస్టేట్ అధికారిగా ఏరియాకు ఆమె చేసిన సేవలను కొనియాడారు. అలాగే గోలేటి నుండి మందమర్రి ఏరియాకు ఎస్టేట్ అధికారిగా బదిలీపై విచ్చేసిన నవనీతంకు అధికారులు ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జ్ ఎస్ఓటు జీఎం రవీందర్, జనరల్ మేనేజర్ కార్యాలయం, అన్ని గనులు, డిపార్ట్మెంట్ల హెచ్ఓడి లు, అధికారులు, పాల్గొన్నారు.

### అక్రమంగా తరలించేందుకు సిద్ధంగా ఉన్న రేషన్ బియ్యం పట్టివేత

**కాగ జ్ నగర్ , సూర్య మేజర్ న్యూస్**

సిర్పూర్ పట్టణం లోని రైల్వే స్టేషన్‌లో బుధవారం సుమారు మధ్యాహ్నం 1:30 గంటల ప్రాంతంలో విశ్వసనీయమైన సమాచారం మేరకు ఎన్ఫోర్స్మెంట్ డిటి రాజ్ కుమార్ సిర్పూర్ టి రైల్వే స్టేషన్ నందు సింగరేణి రైలు ద్వారా మహారాష్ట్రలోని వీరూర్‌కి అక్రమంగా రవాణా చేయుటకు సిద్ధంగా ఉంచిన సుమారు 5.05 క్వింటాళ్ల రేషన్ బియాన్ని పట్టుకోవడం జరిగింది. నిందితులు ఇట్టి బియ్యాన్ని వదిలి పెట్టి పారిపోవడం జరిగింది. సమగ్ర విచారణ చేపట్టి త్వరలోనే వారి వివరాలు సేకరించి తగిన చర్యలు తీసుకుంటాము అని ప్రభుత్వం ద్వారా ఉచితంగా అందించబడుతున్న పిడిఎస్ బియ్యాన్ని దుర్వినియోగం చేసినట్లయితే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందనీ ఆయన తెలిపారు.



## మలేషియా జైలులో శిక్ష అనుభవిస్తున్న వారి
# విడుదలకు కృషి - భూక్యా జాన్సన్ నాయక్

**ఖానాపూర్ సూర్య మేజర్ న్యూస్ :**

ఉపాధి నిమిత్తం గత సంవత్సరం కడెం మండలంలోని లింగాపూర్ మరియు దస్తురాబాద్ మండలంలోని మూన్యాల్ గ్రామాలకు చెందిన



ఆరుగురు మలేషియా కు వెళ్లారు. అనంతరం అక్కడ అకారణంగా జైల్లో ఉన్నారని కుటుంబసభ్యులకు సమాచారం అందగా, కుటుంబసభ్యులు బీఆర్ఎస్ పార్టీ ఖానాపూర్ నియోజకవర్గ ఇంచార్జ్ భూక్యా జాన్సన్ నాయక్‌కి వారి వివరాలు తెలుపడం జరిగింది. వారి వివరాలు తెలుసుకున్న జాన్సన్ నాయక్ ఎలాగైనా జైలులో ఉన్నవారి విడుదలకు కృషి చేస్తానని హామీ ఇవ్వడం జరిగింది . ఇచ్చి హామీ మేరకు బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సహాయంతో స్వయంగా మలేషియా వెళ్లి, అక్కడి మలేషియా ఉన్నతాధికారులను సంప్రదించి, వారు అక్రమ ఆయుధ చట్టం కింద జైలులో ఉన్నారని తెలుసుకొని, మలేషియాలోని జైల్లో ఉన్న కడెం మండలం లింగాపూర్ వసూలు రాచకొండ నరేష్, తలారి భాస్కర్, గురుజాల శంకర్, గురిజాల రాజేశ్వర్, గుండా శ్రీనివాస్, మరియు మూన్యల్ గ్రామం దస్తూరబాద్ మండలం యమునూరి రవీందర్ లు జైల్లో శిక్ష అనుభవిస్తున్న వీరందరినీ భూక్యా జాన్సన్ నాయక్ ములాఖాత్ అయి వారిని పరామర్శించి , ఓదార్చి వారి విడుదల కోరకు కృషి చేస్తానని వారికి భరోసా కల్పించారు. అనంతరం అధికారులతో మాట్లాడి ఉపాధి నిమిత్తం వీరు మలేషియా వచ్చారని , ఎలాంటి నేరం చేయాలేదని వారికి తెలిపారు. అకారణంగా వీరు జైల్లో మగ్గుతున్నారని, భారతదేశంలో వీరి కుటుంబాల పరిస్థితి దయనీయంగా ఉందని, ఉపాధి కోసం మలేషియా వచ్చి ఇక్కడ జైల్లో మగ్గుతున్నారని వారికి తెలియజేశాడు. తక్షణమే వీరి విడుదలకు తమవంతు సహాయ సహకారాలను అందించాలని అధికారులను జాన్సన్ కోరారు. అనంతరం జాన్సన్ నాయక్ సొంత నిధులతో వీరి విడుదల కోరకు ప్రత్యేకంగా అక్కడి స్థానిక న్యాయవాదులను నియమించి, త్వరగా వీరు మలేషియా జైలు నుంచి విడుదలయ్యే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు. జైల్లో ఉన్న ఆరుగురు విడుదలై, ఇంటికి తిరిగి వచ్చే వరకు తన శాయశక్తుల కృషి చేస్తానని జాన్సన్ నాయక్ తెలిపారు.

## మహిళల భద్రత ,రక్షణకి
# షీ టీమ్స్‌తో మరింత భరోసా

### - మంచిర్యాల జిల్లా షి టీమ్ యస్.ఐ. హైమ - షి టీం సేవలపై కేజీబీవి విద్యార్థినిలకు అవగాహన సదస్సు.

**బెల్లంపల్లి, మార్చి 05, సూర్య మేజర్ న్యూస్:**

బెల్లంపల్లి తాళ్లగురిజాల పోలిస్ ఆద్వర్యంలో బెల్లంపల్లి కస్తూరిబా గాంధీ బాలిక విద్యాలయ నందు విద్యార్థినిలకు మంచిర్యాల జిల్లా షీ టీం సిబ్బంది షి టీమ్ సేవలపై అవగాహన సదస్సు నిర్వహించడం జరిగినది. అందులో భాగంగా మంచిర్యాల జిల్లా షీ టీం సిబ్బంది మహిళా కానిస్టేబుల్ జ్యోతి మాట్లాడుతూ మహిళల భద్రత, మహిళా చట్టాలు, షి టీమ్స్,అమ్మాయిలపై వేధింపులు,సెల్ ఫోన్ వినియోగం వల్ల ఏర్పడే అనర్థాలు,ఆన్లైన్ మోసాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మహిళల రక్షణ కోసం ప్రతి రోజు బస్టాండ్ మరియు ప్రధాన చౌరస్తాలో జన సమీకరణ ప్రాంతాల్లో కాలేజీల వద్ద షీ టీం నిఘా నిరంతరంగా ఉంచడం జరుగుతుందని, వ్యక్తిగత ఫోటోలను డిపి లుగా పెట్టుకోవద్దని, మొబైల్ యాప్ లలో వచ్చే అనుమానాస్పద బ్లూ లింకులను క్లిక్ చెయ్యొద్దని, నగదు లావాదేవీలను బ్యాంకుల ద్వారా నిర్ధారించుకోవాలని, వ్యక్తిగత సమాచారం,బ్యాంక్ వివరాలు, ఏటీఎం పిన్ నంబర్లు, సోషల్ మీడియాలో బహిర్గతం చేయవద్దని తెలిపారు. ఎవరైనా వేధింపులకు గురి చేస్తే మహిళలు భయపడకుండా 6303923700 నంబర్ కు లేదా 100 నంబర్ కు డయల్ ఫోన్ చేసి సమస్య తెలపాలని కోరారు. ఫోన్ చేసిన వారి వివరాలు గోప్యంగా ఉంచడం జరుగుతుందని స్పష్టం చేశారు. అలాగే అత్యాశకు పోయి సైబర్ క్రైమ్ ఆన్లైన్ మోసాలు, లోన్ యాప్స్ గురవుతున్నారని వాటికి జోలికి పోకుండా ఉండాలని, ఎవరైనా ఆన్లైన్ మోసాలకు గురైతే సైబర్ క్రైమ్ హెల్ప్ లైన్ నెంబర్ 1930 కి సమాచారం ఇవ్వాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో తాల్లగురిజాల పోలిస్ స్టేషన్ ఏ.యస్.ఐ. మజార్ హుస్సేన్, మంచిర్యాల జిల్లా షీ టీం సిబ్బంది జ్యోతి, సతీష్, బెల్లంపల్లి కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ రజిత ,సిబ్బంది మరియు విద్యార్థినిలు పాల్గొన్నారు.

# ఇంటర్ వార్షిక పరీక్షలను సజావుగా నిర్వహించాలి

### - జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే

**ఆసిఫాబాదు ప్రతినిధి,సూర్య మేజర్ న్యూస్ :** జిల్లాలో ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలను సజావుగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. బుధవారం ఇంటర్ పరీక్షలు ప్రారంభమైన నేపథ్యంలో జిల్లా కేంద్రంలోని తెలంగాణ ఆదర్శ పాఠశాలలో ఏర్పాటుచేసిన ఇంటర్మీడియట్ పరీక్ష కేంద్రాన్ని సందర్శించి పరీక్ష నిర్వహణ తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఈనెల 25వ తేదీ వరకు జరగనున్న ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షాలను అధికారులు సమన్వయంతో పని చేసి సజావుగా నిర్వహించాలని తెలిపారు. పరీక్షల నిర్వహణ కొరకు జిల్లాలో 19 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని, ఇంటర్ ప్రథమ సంవత్సరంలో 3 వేల 997 మంది జనరల్, 761 మంది ఒకేషనల్, ద్వితీయ



సంవత్సరంలో 4 వేల 527 మంది, 769 మంది ఒకేషనల్ విద్యార్థులు పరీక్షకు హాజరు కానున్నారని తెలిపారు. పరీక్ష కేంద్రాలలో విద్యార్థులకు సరిపడా ఫర్నిచర్, త్రాగునీరు, ఫ్యాన్లు, వెలుతురు ఉండేలా ఏర్పాట్లు చేయడం జరిగిందని, విద్యార్థుల పరీక్ష కేంద్రంలోనికి వెళ్ళే సమయంలో తనిఖీలు నిర్వహించి పరీక్ష కేంద్రంలోనికి మొబైల్, ఇతర ఎలాంటి ఎలక్ట్రానిక్ పరికరాలు అనుమతించకూడదని తెలిపారు. ప్రతి పరీక్ష కేంద్రంలో అత్యవసర వైద్య సేవలు నిమిత్తం వైద్య సిబ్బందిని నియమించి అవసరమైన మందులు, ఓ.ఆర్.ఎస్. ప్యాకెట్లు అందుబాటులో ఉంచడంతో పాటు విద్యార్థులు సకాలంలో పరీక్షా కేంద్రాలకు చేరుకునే విధంగా ఆయా రూట్లలో సమయానుసారంగా బస్సులు నడిపించడం జరుగుతుందని తెలిపారు. పరీక్ష సమయంలో అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా జరిగే విధంగా చర్యలు తీసుకోవడం జరిగిందని తెలిపారు. అనుమతి లేని ఇతర వ్యక్తులు పరీక్ష కేంద్రంలోనికి రాకుండా పోలీసు శాఖ అధికారులు బందోబస్తు నిర్వహించాలని, పరీక్షా కేంద్రంలో ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా ముఖ్య పర్యవేక్షకులు బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ముఖ్య పర్యవేక్షకులు, ఇన్విజిలేటర్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## విద్యార్థికి పరీక్ష కేంద్రంలో సమయానికి చేర్చిన ముధోల్ ఎస్సై సంజు

**ముధోల్ మార్చ్ 5,సూర్య మేజర్ న్యూస్**

ముధోల్ మండల కేంద్రంలో ఇంటర్ పరీక్షల నేపథ్యంలో ఉ.8 నుంచే విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు చేరుకున్నారు. ఓ విద్యార్థి మాత్రం ప్రభుత్వ జూనియర్ కాలేజ్లో పరీక్ష రాయాల్సి ఉండగా పొరపాటున గురుకుల కాలేజ్లో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రానికి వచ్చాడు. పరీక్ష కేంద్రం ఇక్కడ కాదని తెలియడంతో పరుగులు పెట్టాడు. అక్కడే ఉన్న ఎస్ఐ సంజీవ్ కుమార్ గమనించి ఆ విద్యార్థిని పోలీసు వాహనంలో సరైన పరీక్ష కేంద్రానికి సమయానికి చేర్చి పరీక్ష రాసేలా చేశారు. దింతో పలువురు ఎస్ఐ ను అభినందించారు. ఉన్నతాధికారి సైతం ఎస్సై ను అభినందించారు.

## గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాలలో ఎమ్మార్వో నిద్ర

**జన్నారం, మార్చి 05, సూర్య మేజర్ న్యూస్ :**

జన్నారం మండల కేంద్రంలో గల గిరిజన బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాలలో మంగళవారం రాత్రి స్థానిక ఎమ్మార్వో రాజ మనోహర్ రెడ్డి విద్యార్థులతో కలిసి నిద్రపోయారు. ముందుగా విద్యార్థులతో కలిసి భోజనం చేసీ పాఠశాల పరిస్థితులను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు పౌష్టికాహారాన్ని అందించాలని ఎప్పటికప్పుడు పరిశుభ్రతపై దృష్టి సారించాలని వార్డెన్ గణేష్ ను ఎమ్మార్వో ఆదేశించారు. రాత్రి విద్యార్థులతో బస చేసి తెల్లవారుజామున విద్యార్థులతో కలిసి మాట్లాడి వెళ్లిపోయారు. ఎమ్మార్వో తో పాటు పాఠశాల హెడ్మాస్టర్ శివరాజం, వార్డెన్ గణేష్ లున్నారు.

## ప్రారంభమైన ఇంటర్ పరీక్షలు

**కెరమెరి సూర్య మేజర్ న్యూస్**

ఇంటర్ పరీక్షలు బుధవారం ప్రారంభమయ్యాయి. ఉదయం 9 గంటలకు ప్రారంభమై 12 గంటల వరకు పరీక్షలు నిర్వహించనున్నారు.మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పరీక్ష కేంద్రం ఏర్పాటు చేయగా ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థులు ఒక గంట ముందుగానే పరీక్ష కేంద్రానికి చేరుకున్నారు. పరీక్ష కేంద్రం లోనికి వెళ్లే ముందు ఇన్విజిలేటర్లు తనిఖీలు చేపట్టి లోనికి అనుమతించారు.మండలంలోని కేజీబీవీ పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. మొత్తం 171 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా,15,156 మంది ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలకు హాజరుయ్యారు. 15మంది గైర్హాజరయ్యారు.పరీక్ష కేంద్రం వద్ద పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

## ప్రమాదవశాత్తు కాలు జారి
# గోదావరిలో పడి వ్యక్తి మృతి

**కడెం, మార్చి 5,సూర్య మేజర్ న్యూస్ :**

కడెం మండలంలో చిట్యాల గొండుగూడ గ్రామానికి చెందిన పందిరి జలపతి తండ్రి సుంగు, అనునతడు రోజ మాదిరిగానే పోలానికి నీరు పట్టడానికి వెళ్లి తన ఎడ్లకు నీరు తాగించి, తను స్నానం చేయడానికి గోదావరి నదిలో దిగగా ప్రమాదవశాత్తు కాలు జారి గోదావరి నదిలో పడి , నీటిలో మునిగి చనిపోయినాడు. ఇట్టి విషయం గురించి అతని భార్య పందిరి సీతాబాయి దరఖాస్తు ఇవ్వగా పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## ప్రత్యేక వైకల్య గుర్తింపు (సదరం) కార్డుల జారీ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలి - జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్.

**నిర్మల్ మార్చి 5, సూర్య మేజర్ న్యూస్:** ప్రత్యేక వైకల్య గుర్తింపు (సదరం) కార్డుల జారీ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు.బుధవారం ప్రత్యేక వైకల్య గుర్తింపు కార్డుల జారీ ప్రక్రియపై సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ,యుడిఐడి పోర్టల్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకునే విధంగా దివ్యాంగులకు అవగాహన కల్పించాలన్నారు. గతంలో సదరం ధ్రువీకరణ పత్రం కోసం మీసేవ కేంద్రాలను ఆశ్రయించేవారని, ఇప్పుడు మీసేవలతో పాటు యుడిఐడి పోర్టల్,స్వంత మొబైల్ ద్వారా కూడా రిజిస్ట్రేషన్,స్లాట్లు నమోదు చేసుకోవచ్చని తెలిపారు. క్యాంపుల వివరాలు కూడా మెసేజ్‌ల ద్వారా తెలియజేయడం జరుగుతుందని అన్నారు.ఈ ప్రక్రియను ఈ నెల నుంచే అమల్లోకి తీసుకురావడం జరిగిందని, 21 రకాల వైకల్యం కలిగిన వారు యుడిఐడి (యూనిక్ డిజేబిలిటీ ఐడి) కార్డును పొందవచ్చని ఆమె తెలిపారు. సదరం కార్డును పోస్టల్ ద్వారా సంబంధిత వ్యక్తులకు చేరవేయడం జరుగుతుందన్నారు. గతంలో సదరం ధ్రువీకరణ పత్రం కలిగి ఉన్నవారు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సిన అవసరం లేదని,వారికి ప్రస్తుతం ప్రభుత్వపరంగా అందుతున్న పథకాలు వర్తిస్తాయని ఆమె పేర్కొన్నారు. దివ్యాంగులు ఎలాంటి అపోహలకు గురికాకుండా వారికి అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. ప్రత్యేక వైకల్య గుర్తింపు కార్డులు జారీ చేసే క్రమంలో వైద్య బృందానికి అవసరమైన వైద్య పరికరాలు,సిబ్బంది తదితర వివరాలను కలెక్టర్ అధికారులను అడిగి తెలుసుకున్నారు.ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు గోపాల్, సునీల్, సురేష్, డిపిఎం శోభారాణి, తదితరులు పాల్గొన్నారు.

## క్రేజీ స్టార్ట్ ఆఫ్ ది ఇయర్ అవార్డును అందుకున్న దాసరి శ్రావణ్ కుమార్

**మందమర్రి, మార్చ్ 5, సూర్య మేజర్ న్యూస్:** మందమర్రి పోలీస్ స్టేషన్లో హెూంగార్డుగా విధులు నిర్వహిస్తూనే, మరో వైపు సామాజిక సేవల్లో చురుకుగా పాల్గొంటూ పట్టణంలో మంచి గుర్తింపు తెచ్చుకున్న దాసరి శ్రావణ్ కుమార్ క్రేజీ స్టార్ట్ ఆఫ్ ది ఇయర్-2025 అవార్డును అందుకున్నారు. పట్టణంలోని సింగరేణి పాఠశాలలో క్రేజీ స్టార్స్ అకాడమీ ఆధ్వర్యంలో మంగళవారం అత్యంత వైభవంగా నిర్వహించిన కార్యక్రమంలో స్పోర్ట్స్, వైద్యం,విద్య,ఆరోగ్యం సోషల్ సర్వీస్, వివిధ రంగాలలో చురుకుగా పని చేసి, సేవ భావం గల వ్యక్తులను గుర్తించి వారికి ఉప్పులేటి నరేష్ ఆధ్వర్యంలో మందమర్రి క్రేజీ స్టార్ ఆఫ్ ది ఇయర్ అవార్డ్స్ 2025 అందజేశారు. ఈ సందర్భంగా సోషల్ యాక్టివేట్ సోషల్ సర్వీస్ చేయడంలో మంచి గుర్తింపు తెచ్చుకున్న దాసరి శ్రావణ్ కుమార్‌ను అకాడమీ సభ్యులు శాలువాతో ఘనంగా సత్కరించి అవార్డు అందజేశారు. ఈ సందర్భంగా హెూం గార్డు దాసరి శ్రావణ్ మాట్లాడుతూ నాలో శక్తి ఉన్నంతవరకు పోలీస్ స్టేషన్ లో హెూంగార్డుగా విధులు నిర్వహిస్తూనే, సమాజంలో పలు సేవా కార్యక్రమాలలో పాల్గొని నా వంతు సహాయాన్ని పేదలకు అందించే విషయంలో ఎల్లప్పుడూ ముందుంటానని స్పష్టం చేశారు. అవార్డు అందజేసిన క్రేజీ స్టార్స్ అకాడమీ వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బఈశ్వర్, కవి గాయకులు ఓయూ జేఏసీ నేత డాక్టర్ ఎల్లన్న, కవి గాయకులు డాక్టర్ రవి, ప్రజా కవి గాయకులు నాగరాజు, నరేష్, యూట్యూబ్ స్టార్స్ తదితరులు పాల్గొన్నారు.